సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం, 1, మే, 2024



నేటి నుంచి టెన్నిస్ పోటీలు
భువనగిరిలో బుధవారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. -IIలో



మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే..
రాష్ట్రంలో మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. -IIలో

గరిష్టం / కనిష్టం
43^0 / 26^0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు

భువనగిరి రూరల్: మండలంలోని తుక్కాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను మంగళవారం 2022 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు శ్రద్ధ, శుక్ల, కిరణ్మయి, కొప్పిసేతి, నారాయణ అమిత్, మాలెంపతి, వికాస్‌మహ, ఉమాశంకర్ ప్రసాద్, మయాంక్‌సింగ్ పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఫైల్స్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం పల్లె పకృతి వనాలు సందర్శించారు. ఉపాధి కూలీల సమస్యలు, వేతనాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు అందుబాటులో నీడ, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పరిశీలించారు. వారి వెంట డీపీఓ ఆర్.సునంద, డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణన్, జెడ్పీసీఈఓ ఎన్.శోభారాణి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, ఎంపీఓ అనురాధ, ఏపీఓ బాలస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ వేణు తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు

భువనగిరిటౌన్: జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పనులు, గ్రామపంచాయతీల నిర్వహణపై అవగాహన కోసం ఆరుగురు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం మంగళవారం జిల్లాకు వచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంత్ కే.జండగేను కలిసారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ పలు పథకాల అమలు తీరుపై వివరించారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

భువనగిరి క్రైం: జాతీయ లోక్ అదాలత్‌ను జూన్ 8న నిర్వహించనున్నట్లు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవి లత మంగళవారం తెలిపారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షుడు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు సలహా మేరకు జిల్లాలోని ఆలేరు, రామన్నపేట, భువనగిరి, చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జిలతో లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. రాజీపడదగు కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి పోలీసు యంత్రాంగం న్యాయవాదులతో సమావేశాలు నిర్వహించాలని జడ్జి మాధవిలత పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగత సమావేశం

భువనగిరి క్రైం: ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవి లత బదిలీపై భువనగిరికి వచ్చిన సందర్భంగా మంగళవారం భువనగిరి న్యాయవాదుల ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్‌లో స్వాగత సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఉపాధ్యక్షులు జయ, కార్యదర్శి కుక్కదువ్వు కృష్ణ పాల్గొన్నారు.

90.44 శాతం ఉత్తీర్ణత

- టెన్త్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 25వ స్థానంలో నిలిచిన జిల్లా
- గత సంవత్సరంతో పోలిస్తే ఒక స్థానం మెరుగు
- పాసైన వారిలో బాలికలే అధికం
- 39 ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత



చౌటుప్పల్ బాలికల గురుకులం విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరోజమ్మ

భువనగిరి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో మళ్లీ అదే తీరు కనబర్చింది. గత సంవత్సరంతో పోల్చితే ఉత్తీర్ణత శాతంలో ఒక స్థానం మాత్రమే మెరుగుపడింది. గత సంవత్సరం 80.97 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు రాగా.. ఈ సారి 90.44 శాతం ఉత్తీర్ణత సాధించి 25వ ర్యాంకులో నిలిచింది.

సత్తాచాటిన అమ్మాయిలు

పదో తరగతి ఫలితాల్లో బాలుర కంటే బాలికలే అధికంగా ఉత్తీర్ణులయ్యారు. గత మార్చి 18 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి మొత్తం 9,108 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 8,237 మంది ఉత్తీర్ణులుకాగా 90.44 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇందులో బాలురు 4,571 మందికి 4,032 మంది పాస్ కాగా.. 88.21 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 4,537 మందికి 4,205 మంది పాస్‌కాగా.. 92.68 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

గతేడాది 26వ స్థానం

గత సంవత్సర ఫలితాల్లో రాష్ట్రంలో 26వ స్థానంలో ఉన్న జిల్లా ఈ సారి 25వ స్థానానికి చేరింది. కాగా.. 2019-20, 2020-21 సంవత్సరాల్లో కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాలు పరీక్షలు లేకుండా 100 శాతం ఉత్తీర్ణత ఇచ్చిన విషయం తెలిసిందే. తర్వాత 2021-22లో 13వ ర్యాంక్, 2022-23లో 26వ ర్యాంక్ రాగా.. ప్రస్తుతం 25వ ర్యాంక్ వచ్చింది. మొత్తంగా ఉత్తీర్ణతలో జిల్లా వెనుకబడి ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 39 ప్రభుత్వ, 36 ప్రైవేట్ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలల్లో 31 మంది విద్యార్థులు 10/10 జీపీఏ మార్కులు సాధించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 37 మంది విద్యార్థులు 10 జీపీఏ మార్కులు సాధించారు.

గత ఎనిమిదేళ్లుగా రాష్ట్ర స్థాయిలో జిల్లాకు వచ్చిన ర్యాంకులు

సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం	ర్యాంకు
2016-17	10,228	8,280	80.95	25
2017-18	9,632	7,793	82.98	19
2018-19	9,678	9,249	95.57	16
2019-20	10,064	10,064	100	కోవిడ్
2020-21	10,087	10,087	100	కోవిడ్
2021-22	9,400	8,799	93.61	13
2022-23	8,973	7,265	80.97	26
2023-24	9,108	8,237	90.44	25

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తీర్ణత వివరాలు

పాఠశాల	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం
ప్రభుత్వ ఉన్నత	279	195	69.89
జెడ్పీహెచ్ఎస్	4001	3425	85.6
కేజీబీవీ	372	316	84.95
మోడల్	629	576	91.57
రెసిడెన్షియల్	254	253	99.61
ఎస్‌డబ్ల్యూఆర్	543	537	98.9
మైనార్టీ(రెసి)	111	110	99.1
బీసీ వెల్ఫేర్	298	295	98.99
ఆశ్రమ	19	13	68.42
ఎయిడెడ్	01	01	100
ప్రైవేట్	2601	2516	96.73
మొత్తం	9,108	8237	90.44

యాదాద్రి కొండపై చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఈఓ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు కొండపైన గల బస్టాండ్‌లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఇప్పటికే ఆలయ మాడ వీధుల్లో దాతల సాయంతో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేశారు.

నిప్పుల కొలిమి

- అత్యధికంగా వెంకిర్యాలలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



భువనగిరిటౌన్: జిల్లాలో ఎండ వేడిమి, వేడి గాలుల తీవ్రత పెరిగిపోతోంది. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మంగళవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువ కాగా.. అన్ని మండలాల్లో 42 డిగ్రీలపైనే నమోదయ్యాయి. అత్యధికంగా బీబీనగర్ మండలం వెకిర్యాలలో 44.7 డిగ్రీలు, మోత్కూర్ మండలం బూజిలాపురం 44.5, బొమ్మలరామారంలో 44.1, వలిగొండలో 44.0, భువనగిరిలో 43.9, నారాయణపురం మండం జనగాంలో 43.9, భువనగిరి మండలం నందనంలో 43.8, చౌటుప్పల్ 43.5, రాజాపేట 43.4, ఆత్మకూర్ 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటవుతాయి

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

చౌటుప్పల్: బీఆర్ఎస్ గెలుపును అడ్డుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటవుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తలతో మంగళవారం చౌటుప్పల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలను శ్రేణులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 16స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి మోదీతో కలిసి వెళ్తారన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు పదవి చేపట్టిన నాటి నుంచే దోపిడీకి తెరలేపారని విమర్శించారు. పదవులను కాపాడుకునేందుకు దోచుకున్న డబ్బులను ఢిల్లీకి కప్పంగా పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య, రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి, పల్లె రవికుమార్, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట శానిటేషన్ కార్మికుల ధర్నా

భువనగిరి: కార్మికులను మోసం చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ.. 2022 జూన్ నుంచి పెంచిన వేతనాలను రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు అందుకుంటున్నా.. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం వేతనం చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు శోభన్‌బాబు శామల, శానిటేషన్ కార్మికులు మేడబోయిన లక్ష్మమ్మ, జేరిపోతుల కమలమ్మ, ఇస్తారమ్మ, కృష్ణ, సులోచన, సోమ నర్సయ్య, లలిత, భారతమ్మ, హేమలత, శారద, నాగరాణి, కిరణ్, శేఖర్, మమత తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న శానిటేషన్ కార్మికులు

ఓటర్లు @18.08లక్షలు

- భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ తుది ఓటరు జాబితా విడుదల
- పురుషులు 8,98,416, మహిళలు 9,10,090 మంది
- ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం



ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ తుదిఓటరు జాబితా ప్రకారం భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్లలో 18,08,585 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,98,416 మంది పురుషులు, 9,10,090 మంది స్త్రీలు, 79 మంది ఇతరులు ఉన్నారు. ఇబ్రహీంపట్నం మినహా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 2,141 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు స్టాటిస్టికల్ సర్వేలైన్స్, వీడియో సర్వైలైన్స్, వీడియో వీవింగ్ టీములు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి 58 టీంలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పర్యవేక్షిస్తున్నాయి. 245 మంది సెక్టార్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుండగా, ఒక సెక్టార్ అధికారి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తారు.

గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ల తయారీపై దృష్టి

ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కే.జెండగే పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. డీసీపీ రాజేశ్‌చంద్ర, రెవెన్యూ కలెక్టర్‌లు ఎన్నికల నిర్వహణలో సహకరిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ల తయారీపై దృష్టిసారించారు.

ఎన్నికల సామగ్రి భువనగిరి నుంచే..

7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి భువనగిరిలోనే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు పంపించనున్నారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

ఎన్నికల బందోబస్తుకు ప్రత్యేక బలగాలు వచ్చాయి. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి ఇప్పటివరకు రూ.9,43,17,069 విలువ గల మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, నగదును పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలనలో ఉంచుతున్నారు. జిల్లాలోని 816 పోలింగ్ కేంద్రాల పరిధిలో 571 మందిని బైండోవర్ చేశారు. 6 ఎంసీసీ ఉల్లంఘన కేసులు పోలీసులు నమోదు చేశారు.

రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలవాలి

ఎన్నికల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జెండగే విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 13న జరిగే పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటర్లు ఓట్లు వేయాలని కోరారు. గత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఓట్లు వేసి రాష్ట్రంలో రోల్ మోడల్‌గా నిలిచామని పేర్కొన్నారు. తుది ఓటరు జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 61 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, 10 నామినేషన్లను తిరస్కరించామని చెప్పారు. 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 39 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటింగ్ కోసం 3 బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

7 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఇబ్రహీంపట్నం	1,70,807	1,68,499	35	3,39,341
మునుగోడు	1,28,233	1,29,321	3	2,57,557
భువనగిరి	1,08,801	1,11,794	1	2,20,596
నకిరేకల్(ఎస్సీ)	1,25,451	1,28,330	4	2,53,787
తుంగతుర్తి(ఎస్సీ)	1,28,719	1,30,539	7	2,59,265
ఆలేరు	1,16,914	1,18,337	19	2,35,270
జనగామ	1,19,491	1,23,270	10	2,42,771
మొత్తం	8,98,416	9,10,090	79	18,08,585

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

మర్రిగూడ: చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ అన్నారు. మంగళవారం మర్రిగూడ మండలంలోని తిరగండ్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం యరగండ్లపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఓటర్లకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, మర్రిగూడ తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ జి. చినమునయ్య, పీఆర్ ఏఈ యశ్వంత్, ఎస్‌ఐ కె. రంగారెడ్డి, సూపరింటెండెంట్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


రాజేష్ చంద్ర, డీసీపీ

భువనగిరి క్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన ప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.7,76,000, 32.85లీటర్ల మద్యం, 20 మందిని బైండోవర్ చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు పైగా డబ్బు తీసుకెళ్లినా, అక్రమంగా మద్యం తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


మాట్లాడుతున్న కుందూరు జానారెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఘన చరిత్ర ఉందని అన్నారు. స్వాతంత్ర్యం తెచ్చింది, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని, గ్యారంటీల అమలులో ప్రజలను భాగస్వామలను చేస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీలను నియమించి, అందులోని ప్రతి సభ్యుడికి రూ.6వేలు అందజేస్తామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కుందూరి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే చివ్వెంల మండలంలోని సమస్యలు పరిష్కారిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చివ్వెంల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్ననాయక్, మాజీ జెడ్పీటీసీ చింతమల్ల రమేష్, వేములపల్లి వాసుదేవరావు, పెద్దిరెడ్డి రాజా, అమరారావు శ్రీనివాస్, ఎండీ జాఫర్, నాగునాయక్, నర్సిరెడ్డి, సమీర్ ఖాన్, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


చిట్యాల: మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే వీరేశం, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మునుగోడు: తెలంగాణలో మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో కొనసాగుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మునుగోడులోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, పాల్వాయి జూనియర్ గోవర్ధన్‌రెడ్డి, మిర్యాల వెంకన్న, పాల్వాయి చెన్నారెడ్డి, సాగర్ల లింగస్వామి, పందుల శ్రీను, పోలే రాజు, జిట్టగోని నరేష్ పాల్గొన్నారు.

చామలకు ఓటు వేస్తే నాకు వేసినట్లే..

చండూరు: కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేస్తే తనకు వేసినట్లేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరులో మంగళవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ తప్ప మిగిలిన ఏ పార్టీలకు ఓటు వేసినా అది బీజేపీకి వేసినట్లేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, చండూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాత, మండల పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్, గట్టుప్పల కాంగ్రెస్ అధ్యక్షుడు నామని జగన్నాథం, ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి

చిట్యాల: చిట్యాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో రెచ్చగొడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చచ్చిపోయిందని, ఆ పార్టీ ఇక మీదట ఏ ఎన్నికల్లో గెలువదని అన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి, దైద రవీందర్, గుత్తా అమిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలేని పాలన అందించిన ఘనత నరేంద్ర మోదీదే

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

అర్వపల్లి: దేశంలో గత పదేళ్లుగా అవినీతిలేని పాలన అందించిన ఘనత ప్రధాని మోదీదేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి ఆయన మంగళవారం అర్వపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను ఓటర్లు నిలదీయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంతంలో రెండు జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని అన్నారు. గతంలో ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. మళ్లీ ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, కాపా రవికుమార్, జుట్టుకొండ సత్యనారాయణ, పగిళ్ల శంకర్, జిన్నె అశ్విన్, బైరబోయిన నాగయ్య, మారపాక రాములు, బుర్ర జనార్దన్, కూర శంకర్ పాల్గొన్నారు.

అప్పగించిన పనిని పక్కాగా నిర్వహించాలి

- కర్నాటక రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వికాస్‌జీ


సమావేశంలో మాట్లాడుతున్న వికాస్‌జీ

చౌటుప్పల్: అప్పగించిన పనిని ఏమాత్రం నిర్లక్ష్యం లేకుండా పక్కాగా నిర్వహించాలని కర్నాటక రాష్ట్ర బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ వికాస్‌జీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మునుగోడు అసెంబ్లీ నియోజవర్గానికి ఆయన ఇన్‌చార్జ్ వచ్చిన సందర్భంగా మంగళవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రతి కార్యకర్తల తమతమ బూత్‌లలో పని చేసుకోవాలన్నారు. ప్రతి ఓటరును కలుసుకోవాల్సిందేనని సూచించారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి అనే విషయాన్ని ఓటర్లకు స్పష్టంగా వివరించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, బీజేపీ నల్లగొండ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ కో-కన్వీనర్ నారాయణయాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేశం, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి

- సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి


రోడ్డుషోలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి జహంగీర్

నకిరేకల్: లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ మండలంలోని కడపర్తి, ఓగోడు, నకిరేకల్, మంగళపల్లి, నోముల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణలోని 17ఎంపీ స్థానాల్లో ఒక భువనగిరి నుంచి మాత్రమే సీపీఎం బరిలో ఉందన్నారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కమ్యూనిస్టు పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేయవద్దన్నారు. ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. గత మూడు దఫాలుగా ఎంపీగా గెలిచిన వారు భువనగిరికి చేసిందేమీ లేదన్నారు. ఈసారి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు యానాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు, మద్యం పట్టివేత

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామశివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో మండల పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష 40వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు మండల పోలీసులు తెలిపారు. పట్టుబడిన నగదును జిల్లా ట్రెజరీ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.

తిప్పర్తిలో రూ.89వేలు..

రామగిరి(నల్లగొండ) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన హనుమంతుల సత్తయ్య మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా తిప్పర్తి మండల కేంద్రంలో పోలీసులు అతడి వద్ద రూ.89వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును ట్రెజరీకి అప్పగించారు.

మర్రిగూడలో మద్యం..

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన కిరాణదుకాణం నిర్వాహకుడు మంగళగిరి బాలాజీ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 63ఓసీ 90ఎంఎల్, ఐదు ఐబీ క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


చండూరు: మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

మర్రిగూడ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని భారతి గార్డెన్‌లో మర్రిగూడ, నాంపల్లి మండలాల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌తో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కన్నీళ్లు మిగిల్చారు తప్ప వారి కష్టాలను తీర్చలేదని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి చెందింది కేసీఆర్‌తోనేనని, రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పల్లె రవికుమార్, పాల్వాయి స్రవంతి, ఇన్‌చార్జి ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

తెలంగాణకు శాశ్వత హీరో కేసీఆర్..

చండూరు: తెలంగాణకు శాశ్వత హీరో కేసీఆర్ అని, బీఆర్‌ఎస్‌ను వీడే వారితో పార్టీకి ఎలాంటి నష్టం లేదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. చండూరులో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ.. కోమటిరెడ్డి బ్రదర్స్ తనకంటే గొప్ప ఏమీ కాదని అన్నారు. భువనగిరిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్, రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డి, మునగాల నారాయణరావు, గుర్రం వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ అవ్వారి గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద విక్రయ కేంద్రం ప్రారంభం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ సన్నిధిలో మరో ప్రసాద విక్రయ కేంద్రాన్ని ఆలయ ఈఓ భాస్కరరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి మంగళవారం ప్రారంభించారు. సెలవు దినాల్లో భక్తులు అధికంగా ప్రసాదాన్ని కొనుగోలు చేస్తుండడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు శివాలయం ఎదురుగా అదనంగా మరో ప్రసాద విక్రయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐల ఆర్థికసాయం

చౌటుప్పల్ : సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన ఏనుగు భూపాల్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబం ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. అదే క్రమంలో అతడి కుమారుల ఉన్నత చదువులు సైతం మధ్యలో ఆగిపోయే పరిస్థితి నెలకొంది. వారి ధీన పరిస్థితిని హైదరాబాద్‌లో నివాసం ఉండే కేవీరెడ్డి, మన్నె నర్సింహారెడ్డిల ద్వారా అమెరికాలోని డల్లాస్‌లో ఉండే వంశీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తెలుసుకున్నారు. వారు గో ఫండ్ మీ అనే సంస్థ ఆధ్వర్యంలో రూ.3.53లక్షల విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలలను మంగళవారం ఎన్‌ఆర్‌ఐలు వరంగల్‌కు వెళ్లి భూపాల్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డికి చెక్కు రూపంలో అందజేశారు. ఇదిలా ఉండగా భూపాల్‌రెడ్డి ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు స్పందించి రూ.3.50లక్షలు అందజేశారు. మొత్తంగా బాధిత కుటుంబానికి దాతలు రూ.7.03లక్షల సాయం అందించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

- బొల్లిగుట్టతండాలో ఘటన


నాకా మృతదేహం

మిర్యాలగూడ: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్య తన భర్తను ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన దామరచర్ల మండలంలోని బొల్లిగుట్టతండాలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లిగుట్టతండా గ్రామానికి చెందిన లావూరి నాకా (50) భార్య 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా.. ఆమె చెల్లెలు పుల్లిని ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన లావూరి రమేష్‌తో పుల్లి వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో నాకా పలుమార్లు పుల్లిని హెచ్చరించాడు. దీంతో తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కారణంతో నాకాను ప్రియుడు రమేష్‌తో కలిసి హతమార్చాలను పన్నాగం పన్నింది. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన నాకాను పుల్లి మాయమాటలు చెప్పి ఇంటి సమీపంలోకి తీసుకెళ్లగా.. అక్కడే ఉన్న ప్రియుడు రమేష్‌తో కలిసి నాకా గొంతును వైరుతో నులిమి హత్య చేశారు. మరుసటిరోజు మంగళవారం నాకా మొదటి భార్య కుమారుడు నెహ్రూ తన తండ్రి మృతిచెంది ఉండడాన్ని గమనించి స్థానికులకు విషయం తెలియజేశాడు. నాకాను హత్య చేసినట్లు గుర్తించి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన తండ్రిని పుల్లితో పాటు ఆమె ప్రియుడు రమేష్ హత్య చేశారని నెహ్రూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాకా మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించి అనంతరం బంధువులకు అప్పగించారు. నెహ్రూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

చౌటుప్పల్ : ఓ రైతు పొలంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని పంతంగి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో జాతీయ రహదారి వెంట ఉన్న చీరిక సంజీవరెడ్డికి చెందిన పొలంలోని అరటి చెట్టు కింద గుర్తుతెలియని మహిళ(50) పడి ఉంది. మధ్యాహ్నం సమయంలో అటుగా వెళ్లిన ఆ పొలాన్ని కౌలుకు చేసే రైతు మహిళను గుర్తించాడు. దగ్గరకు వెళ్లి ఆమెను పిలిచాడు. ఆమె నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎవరికైనా మృతురాలి వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో గానీ, 8712662481, 8712662744ను సంప్రదించాలని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పది ఫలితాల్లో 'జయ' ప్రభంజనం


10జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

- 73మంది విద్యార్థులకు 10జీపీఏ

సూర్యాపేటటౌన్ : పదోతరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో సూర్యాపేట పట్టణంలోని జయ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 386మంది విద్యార్థులకు గాను 73మంది విద్యార్థులు 10జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. అలాగే 64మంది విద్యార్థులు 9.8జీపీఏ, 57 మంది 9.7జీపీఏ, 46మంది 9.5జీపీఏ సాధించినట్లు వెల్లడించారు. అలాగే 333మంది విద్యార్థులు 9జీపీఏ పైగా సాధించారన్నారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

నేటి నుంచి భువనగిరిలో టెన్నిస్ పోటీలు


పోటీలకు సిద్ధం చేసిన టెన్నిస్ కోర్టు

భువనగిరి : పట్టణం మరో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదికకానుంది. పట్టణంలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏప్రిల్ 29, 30తేదీల్లో టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 1నుంచి 4వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ప్రీ క్వార్టర్, క్వార్టర్స్, సెమీఫైనల్‌తో పాటు ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు మంగళవారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు..

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి మొత్తం 143 మంది క్రీడాకారులు వచ్చారు. అండర్-14 బాలబాలికల విభాగం కావడంతో ఇదే పాఠశాలలో క్రీడాకారులకు వసతి కల్పించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ

రాజాపేట : తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండలంలోని బొందుగుల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్ల చిన్నమల్లేశం, బాల్ల శ్రీశైలం, సిద్దులు, ఆమరాజు బాలనర్సయ్య, శనిగారం యాదగిరి తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. వారి ఇళ్లకు తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. ఐదు ఇళ్లలో కలిపి సుమారు రెండు గ్రాముల బంగారం, 25తులాల వెండి, రూ.70వేల నగదు అపహరించినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. చోరీ జరిగిన విషయమై ఏసీపీ రమేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూజ్‌టీమ్‌తో విచారణ చేపట్టారు.

యువకుడి బలవన్మరణం


భాను (ఫైల్)

రాజాపేట : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండంలోని నెమిల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గవ్వల బాలయ్య జయమ్మకు ఇద్దరు కుమారులు. వారి చిన్న కుమారుడు భాను కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం దమ్మాయిగుడలోని బంధువుల ఇంట్లో జరిగిన పండుగకు హాజరై మరుసటి రోజున తన స్వగ్రామం నెమిలకు వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు అధికమవ్వడంతో మనస్థాపానికి గురైన తన వ్యవసాయ బావివద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం అటుగా వెళ్లిన సమీప రైతు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో 12గొర్రెలు మృతి

భూదాన్‌పోచంపల్లి : కుక్కల దాడిలో 12గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి మున్సిపల్ కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మూడో వార్డుకు చెందిన గొర్రెల కాపరి బాత్క లింగయ్య రోజు మాదిరిగానే సోమవారం గొర్రెలను మేపుకొని రాత్రి వాటిని మందలో తోలి ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున మంద వద్దకు వచ్చి చూడగా కుక్కలు దాడి చేయడంతో 12గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. వాటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

కారును ఢీకొట్టిన కంటెయినర్

- నలుగురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ముందు వెళ్తున్న కారును కంటెయినర్ ఢీకొట్టడంతో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో హైదరాబాద్-వరంగల్ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన సోమ నర్సయ్య ఖాళీ కంటెయినర్‌ను తీసుకుని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్దకు రాగానే.. మోటకొండూర్ వెళ్లే క్రాస్ రోడ్ వద్ద ముందు వెళ్తున్న కారును అతివేగంతో ఢీకొట్టాడు. దీంతో కంటెయినర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న నరోత్తం రెడ్డి, రజనీకాంత్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఆ కారు ముందున్న బొలేరో వాహనం, బైక్‌ను కూడా ఢీకొట్టడంతో బొలేరో వాహనం నడుపుతున్న డ్రైవర్ రాజు, బైక్‌పై ప్రయాణిస్తున్న భిక్షపతికి కూడా గాయాలయ్యాయి.

క్షతగాత్రులకు మంత్రి కొండా సురేఖ సహాయం..

ప్రమాదం జరిగిన సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ వెంటనే తన కాన్వాయ్‌ను ఆపి, క్షతగాత్రుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి గాయాలైన వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రూ.4లక్షలు సీజ్..

కంటెయినర్ డ్రైవర్ సోమ నర్సయ్య వద్ద రూ.4లక్షలు సీజ్ చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.